
సాక్షి ఒడిశా

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.56.990లు, బంగారం 350 మిల్లీగ్రాములు వెండి 35 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఐసీయూ స్పెషలిస్టుల కొరత

పర్లాకిమిడి ఆస్పత్రిలో డాక్టర్ల కొరత వేధిస్తోంది. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించారు.

- 8లో

దాస్ ముర్మ అస్తమయం



ప్రముఖ చిత్రకారుడు దాస్ ముర్మ కన్నుమూశారు. తోటి చిత్రకారులు సంతాపం తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ ప్రభాకర్

రాయగడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఆర్పీఎఫ్ నాలుగో బెటాలియన్ కమాండెంట్ ప్రభాకర్ ఉపాధ్యాయ అన్నారు. స్థానిక మహిళా కళాశాలలో బుధవారం జరిగిన వార్షిక క్రీడోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులకు ప్రతిభ ఉన్నప్పటికీ ప్రోత్సాహం కరువవ్వడంతో ఆయా రంగాల్లో రాణించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి దశ నుంచే గమ్యాన్ని రూపొందించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అర్చనా పట్నాయక్, కెప్టెన్ రీతారాణి మిశ్రా, అధ్యాపకురాలు శ్రద్ధాంజలి పండ తదితరులు పాల్గొన్నారు.

ఆవాస్ గృహాలపై అవగాహన



ఆవాస్ గృహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయగడ: నిరుపేదలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ గృహాలకు సంబంధించి జిల్లాలోని కల్యాణ సింగుపూర్ పంచాయతీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఆ పథకాన్ని పొందలేకపోతున్నారని కల్యాణ సింగుపూర్ పంచాయతీ కార్యనిర్వాహక అధికారులు సిబ్బంది ఈ మేరకు ఆ పథకం గురించి పూర్తి వివరాలు తెలిపారు. ఆధార్ కార్డు, లేబర్ కార్డుతో పాటు బ్యాంకు ఖాతా అకౌంట్ ఉన్న వారు ఈ పథకం కోసం సరాసరి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అయితే మారుమూల గ్రామాల్లోని ప్రజలు ఈ పథకం గురించి సరైన అవగాహన లేకపోవడంతోనే పొందలేకపోతున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనలు గురించి అధికారులు వివరించారు.


విజి'లెన్స్'



జయపురంలోని పాత్రో భవనం, (ఇన్‌సెట్లో) ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో

జయపురం: మున్సిపాలిటీ ప్రభుత్వ ఇంజినీర్ విశ్వనాథ్ పాత్రో ఆస్తులపై కొరాపుట్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై జయపురంలోని అతడి మూడంతస్తుల భవనంపై దాడులు జరిపి పెద్ద మొత్తంలో బంగారం, నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే గంజాం జిల్లా గంజాం కాపువీధిలోని రెండంతస్తుల భవనం, భువనేశ్వర్ పాటియాలో జిల్లా విద్యా శిక్షణ సంస్థలో పని చేస్తున్న పాత్రో భార్య కార్యాలయంలోనూ ఏకకాలంలో దాడులు చేపట్టినట్లు సమాచారం. అయితే ఇంతవరకు పూర్తి వివరాలు వెల్లడించలేదు.

పాముకాటుతో వ్యక్తి మృతి



మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రి వద్ద ఉంగ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితికి చెందిన ఉంగ మధిర(28) అనే రైతు తన పొలంలో వరి కుప్పలకు కాపలాగా ఆదివారం రాత్రి పడుకున్నాడు. అయితే సోమవారం తెల్లవారు జామున ఒక విషసర్పం కాటు వేయడంతో వెంటనే తనతో పాటు నిద్రించిన వ్యక్తి పోడియ ఆరోగ్య కేంద్రానికి తరలించాడు. దీంతో అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మల్కన్‌గిరి తీసుకెళ్లారు. మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడు ఉంగకు భార్య గౌరీ మధిర, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.



మేళాను ప్రారంభిస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



పర్లాకిమిడిలో కృషి యాగ్రోటెక్ స్టాల్



మేళాకు హాజరైన రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు

ఆధునిక వ్యవసాయంతో..

అధిక దిగుబడులు

- యంత్రాలు, పనిముట్లు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ బిజయ కుమార్ దాస్, సెంచూరియన్ వర్సిటీ అగ్రికల్చర్ స్కూల్ డీన్ సత్యప్రకాష్ నోందో



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ డీన్ సత్యప్రకాష్ నోందో

పర్లాకిమిడి: రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులైన యంత్రాలు, పనిముట్లు అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించవచ్చని సెంచూరియన్ వర్సిటీ ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ కళాశాల డీన్ సత్యప్రకాష్ నోందో అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో జిల్లా స్థాయి వ్యవసాయ పనిముట్లు, యంత్రాల మేళాను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ మేళాలో ఏ.డి.ఎం రాజేంద్ర మింజ్, డీ.ఆర్.డీ.ఏ అధికారి గుణనిధి నాయక్, జిల్లా ముఖ్యవ్యవసాయ అధికారి రాంప్రసాద్ పాత్రో, వ్యవసాయ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ మహాపాత్రో (భువనేశ్వర్), పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్న, చిన్న యంత్రాల వినియోగంపై గ్రామాల్లో రైతులను విద్యార్థులు చైతన్య పరుస్తున్నారని డీన్ నోందో అన్నారు. పాత పద్ధతులైన విత్తనాలు నాటడం, గొప్పు తీయడం, వరిపంట కోత, నూర్చడం వల్ల రైతులకు సమయంతోపాటు ఖర్చు పెరిగి నష్టాలు భరించాల్సి వస్తోందన్నారు. వ్యవసాయంలో ట్రాక్టర్లు, గొప్పుతీత పనిముట్లు, ట్రస్సర్, ధాన్యం ఎగరపోత యంత్రాలను రైతులకు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుసాని జెడ్పీటీసీ జోన్-1 ఎస్.బాలరాజు అన్నారు. వ్యవసాయ పనిముట్లు, చిరుధాన్యాలు, ట్రాక్టర్లు వంటి 48 స్టాల్స్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఒడిస్సీ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. ఐదురోజుల పాటు ఈ వ్యవసాయ యంత్రమేళా ఉంటుందని అధికారులు తెలిపారు. గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్, ఉద్యానవనాల డిప్యూటీ డైరెక్టర్ సుశాంత రంజన్ దాస్, అసిస్టెంట్ వ్యవసాయ అధికారి శుభశ్రీ ప్రియదర్శిని, సంఘమిత్ర ప్రదాన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి వ్యవసాయ పనిముట్ల మేళాలో ..



ఒడిస్సీ నృత్య ప్రదర్శన

ఏడోమైలు వద్ద పులి సంచారం..?



పర్లాకిమిడి: గుసాని సమితి ఏడో మైలు దారి బాగుసల గ్రామం వద్ద గత రాత్రి పెద్ద పులి సంచరించినట్లు పాదముద్రల ద్వారా గ్రామస్తులు గమనించారు. అయితే దీనిపై నారాయణపూర్ దేవగిరి రేంజ్ అధికారి బ్రహ్మనంద సాహు ఇప్పటివరకూ ధ్రువీకరించలేదు. పెద్ద పులి సంచారంపై వస్తున్న పలు కథనాలుపై డీఎఫ్ఓ సుబ్రహ్మణ్యం ఆనంద్ మాట్లాడుతూ, ఏడోమైలు, బాగుసల గ్రామ పరిసర ప్రాంతాల్లో దేవగిరి అటవీ సిబ్బంది మంగళవారం సాయంత్రం గ్రామంలో హెచ్చరికలు జారీ చేశారు. పెద్దపులి కదలికలపై దేవగిరి రేంజ్ అధికారులు మంగళవారం ట్రాకింగ్ కెమెరాలు అమర్చుతున్నారు. గత ఏడాది డిసెంబరులో రాయఘడ, నువాగడలో తిరిగిన పెద్ద పులి తిరిగి ఈ ప్రాంతంలో తిరుగుతోందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బాగుసల అటవీ ప్రాంతంలో పెద్ద పులి అడుగుజాడలను అటవీ అధికారులు పరిశీలిస్తున్నారు.

కోర్టు నుంచి ఖైదీలు పరారు



షకిల్ ఖాన్



షారుఖ్ ఖాన్

కొరాపుట్: శిక్ష పడిన వెంటనే ఖైదీలు కోర్టు నుంచి పరారయ్యారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కోర్టుల సముదాయం నుంచి హరియాణా రాష్ట్రం రేవా జిల్లాకి చెందిన షకిల్ ఖాన్, షారుఖ్ ఖాన్‌లు పరారయ్యారు. గత ఏడాది జనవరి 21వ తేదీన హర్యానా రాష్ట్రం నుంచి వచ్చిన ఐదుగురు దొంగలు ఏటీఏం లూటి చేసి పరారయ్యారు. వారం దరినీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు జైలులో ఉండగా షకిల్ ఖాన్, షారుఖ్ ఖాన్‌లు బెయిల్ పై ఉన్నారు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తి సీమా త్రిపాఠి నిందితులందరికీ ఏడేళ్ల చొప్పున శిక్ష విధించారు. ఈ తీర్పు వినగానే షకిల్ ఖాన్, షారుఖ్ ఖాన్ కోర్టు నుంచి పరారయ్యారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గం సభ్యులు

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న జూనియర్ ఉపాధ్యాయుల సంఘం కొత్త కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. కాసీపూర్‌లోని హనుమాన్ మందిరం ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా సునాముఖి తురుక్, కార్యదర్శిగా బిజయలక్ష్మీ జెన్న, ఉపాధ్యక్షుడిగా రాజేంద్ర బలో, సహ కార్యదర్శిగా ముకుంద సబర్, కోశాధికారిగా తాపస్ రంజన్ బెహర, క్లస్టర్ కన్వీనర్లుగా దీపక్ ఘొష్, ఇంద్ర కుమార్ నాయక్, సరోజ్ కుమార్ నాయక్‌లు నియమితులయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించి సమావేశంలో చర్చించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహార ప్యాకెట్లను విద్యార్థులకు అందిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్ సమితి కమిపాదొర ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. పాఠశాల హెచ్‌ఎం నవీన్ కుమార్ నందో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజాపూర్ పంచాయతీ సర్పంచ్ జెరిమన పొడగండ, పాఠశాల పరిచాలన కమిటీ అధ్యక్షుడు ప్రదీప్ బిఆస్కా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జెరిమాన మాట్లాడుతూ విద్యార్థుల్లో పౌష్టికాహారం లోపిస్తే చదువుపై శ్రద్ధ తగ్గిపోతుందని, వారిలో మానసిక ఉత్సాహం కరువవుతుందని పేర్కొన్నారు. అందువలన సకాలంలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'అంగవైకల్యం మనసుకు కాదు'



నువాగడకు చెందిన దివ్యాంగ దంపతులకు వివాహ ప్రోత్సాహక చెక్కును అందజేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



వృద్ధురాలికి ద్విచక్రవాహనం పంపిణీలో కలెక్టర్ బిజయకుమార్ దాస్

పర్లాకిమిడి: అంగవైకల్యం శరీరానికి కానీ మనస్సుకు కాదని కలెక్టర్ బిజయకుమార్ దాస్ అన్నారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, సీడీఎంఓ డాక్టర్ మహమ్మద్ ముబారక్ ఆలీ, సీసీడీ సంస్థ అధ్యక్షులు అడ్డాల జగన్నాథ రాజు, డీఎస్ఎస్ఓ సంతోష్ కుమార్‌నాయక్, సబ్‌కలెక్టర్ అనుప్ పండా, సమర్థ దివ్యాంగుల సంస్థ అధ్యక్షులు సంతోష్ మహారాణా పాల్గొన్నారు. గజపతి జిల్లాలో 1200 మంది దివ్యాంగులు ఉన్నారని, ఇప్పటివరకూ యు.ఐ.ఐ.డీ నమోదు ప్రక్రియ చేయించుకోకుండా ఉన్నవారు త్వరితగతిన ఆన్‌లైన్‌లో పూర్తి చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు పొందాలని జిల్లా సామాజిక భద్రతా అధికారి సంతోష్ కుమార్‌నాయక్ అన్నారు. ప్రత్యేక పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో నువాగడ బ్లాక్‌కు చెందిన భీంసేన్,అయితా మండల్ దివ్యాంగ దంపతులకు వివాహ ప్రోత్సాహకం క్రింద రూ.రెండున్నర లక్షలు, గుమ్మాబ్లాక్‌కు చెందిన నారాయణ లిమ్మా దంపతులకు రూ.రెండున్నర లక్షల చెక్కు, మరో దివ్యాంగ వృద్ధురాలికి బైక్ అందజేశారు. అనంతరం కటక్ రెవెన్షా కళాశాలలో చదువుతున్న గజపతి జిల్లా వాసికి బ్రెయిలీ ల్యాప్‌టాప్‌ను అధికారులు అందజేశారు. కార్యక్రమంను సబ్‌డివిజన్ దివ్యాంగ భద్రతాధికారి ఉత్సర్‌గీతా బడరయితో ముఖ్యవక్తగా వ్యవహరించారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం



దివ్యాంగులకు పెన్షన్ అందిస్తున్న టున్ని

రాయగడ: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసిందని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సమితి కార్యాలయం సమావేశం హాల్‌లో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. దివ్యాంగులకు అండగా ప్రభుత్వం ఉందని భరోసా ఇచ్చారు. అనంతరం 40 మంది దివ్యాంగులకు పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో సమితి వైస్ చైర్మన్ హర ప్రసాద్ హెప్రుక, ఏబీడీఓ కాలుచరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



మాట్లాడుతున్న విద్యాధికారి ప్రమోద్ కుమార్ ముండ



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు



ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

జయపురం: దివ్యాంగులకు సమాజంలో సముచిత స్థానం కల్పించేందుకు సామూహిక ఉద్యమం అవసరమని కొరాపుట్ జిల్లా విద్యా విభాగ విద్యాధికారి ప్రమోద్ కుమార్ ముండ అన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూ నగర్‌లో సిటీ హైస్కూలు ప్రాంగణం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగుల హక్కులు, రక్షణ, సంక్షేమం పరిరక్షణ వంటి అంశాలపై మాట్లాడారు. సభకు ముందు ఉపాధ్యాయురాలు సుభశ్రీ పాత్రో నేతృత్వంలో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ఐదు కొండలు దాటితేనే కడుపు నిండేది



పీడీఎస్ బియ్యం తలపై పెట్టుకొని కొండలు దాటుతున్న గిరిజనులు

ఐదు కిలోల బియ్యం కావాలంటే ఐదు కొండలు దాటాల్సిన దుస్థితి వారిది. కొరాపుట్ జిల్లాలోని నారాయణ పట్న సమితిలో నుడిసి గ్రామంలో 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామానికి రహదారి లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ప్రభుత్వం అందించే 5 కేజీల సంక్షేమ పీడీఎస్ బియ్యం కోసం గిరిజనులు ప్రతి నెల ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి 5 కొండలు దాటి ప్రమాదకర మార్గంలో నడుస్తూ తిరిగి రాత్రి 8 గంటలకు ఇళ్లకు చేరుకుంటారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేదు. ఒకప్పుడు ఈ గ్రామ పరిసరాలు మావోయిస్టుల ఖిల్లా గా ఉండేవి. ప్రస్తుతం మావోయిస్టులు ప్రభావం లేక పోయినా ప్రభుత్వ అధికారులు ఏనాడూ రావడం లేదు. దీంతో వీరికి 'నడక'యాతన తప్పడం లేదు.

- కొరాపుట్

క్లుప్తంగా

బొగ్గు లారీ బోల్తా



సర్వీసు రోడ్డుపై బోల్తా పడిన లారీ

నరసన్నపేట : టెక్కలి నుంచి నరసన్నపేట వైపు వెళ్లే దారిలో గొట్టిపల్లి ఫ్లై ఓవర్ డౌన్‌లో జాతీయ రహదారిపై మంగళవారం బొగ్గు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డివైడర్ దాటి సర్వీసు రోడ్డుపై అడ్డంగా పడింది. ఒడిశాలో తాల్చేరు నుంచి అనకాపల్లికి వెళ్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. లారీ వంద మీటర్ల దూరం ముందుకు దూసుకెళ్లడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. పోల్ విరిగినా ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగిన వెంటనే సర్వీసు రోడ్డుపై రాకపోకలు స్తంభించడంతో నరసన్నపేట హెచ్‌సీ దాలినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గాయపడిన డ్రైవర్ పూర్ణను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



చాపర పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: ఆశ్రమ పాఠశాలల్లో మెనూ తప్పనిసరిగా పాటించాలని సీతంపేట ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మెళియాపుట్టి మండలం పెద్దలక్ష్మీపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ, తరగతిగదులు, మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సౌకర్యాలు, బోధనపై ఆరా తీశారు. అనంతరం చాపర, మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి మందుల నిల్వలను పరిశీలించారు. గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. చాపర పీహెచ్‌సీలో విద్యుత్ సమస్య ఉందని వైద్యులు పావని,హేమంత లక్ష్మీ పీఓ దృష్టికి తీసుకెళ్లగా.. పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

శ్రీకాకుళం అర్బన్: హిరమండలం మండలంలోని తుంగతంపర గ్రామానికి చెందిన సీహెచ్ రమేష్ మంగళవారం ఉదయం విశాఖలో ఆర్టీసీ బస్సు ఎక్కి శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో దిగాడు. ఇంటికి వెళ్లాక పర్సు కనిపించకపోవడంతో తీవ్ర నిరాశకు లోనయ్యాడు. అయితే ఆ పర్సు నాన్‌స్టాప్ బస్ డ్రైవర్‌కు దొరకడంతో ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు ద్వారా ప్రయాణికుడికి అందజేశారు. పర్సులో రూ.8250 నగదు, 2 ఏటీఎం కార్డులు ఉన్నాయి. ఈ సందర్భంగా డ్రైవర్‌ను ఆర్టీసీ సిబ్బంది అభినందించారు.

విద్యుత్ షాక్‌తో మూడు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రామ పరిధిలోని పొలాల్లో మేతకు వెళ్లిన మూడు పాడి ఆవులు మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృత్యువాత పడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడి ఉండటంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. హైటెన్షన్ వైర్లు పొలాల్లో తెగిపడి ఉండటంతో అందరూ ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో పొట్నూరు అచ్చోడుకి చెందిన రెండు ఆవులు(రూ.1.20 లక్షలు), పిల్లాటి అప్పన్నమ్మకు చెందిన ఆవు మృతి(రూ.70 వేలు) మృతి చెందాయి. ప్రమాద ఘటన వివరాలను ఎంపీటీసీ బగ్గు రాజారావు రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు పరిహారం అందజేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన

- నేడు నేవీ డే వేడుకలకు హాజరు



నీలాద్రి విహార్ ప్రాంతంలో రఘునాథ్ ముర్ము విగ్రహం ఆవిష్కరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీలో నేవీ డే వేడుకలకు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఐదు రోజుల రాష్ట్ర పర్యటన మంగళవారం నుంచి ప్రారంభమైంది. బుధవారం పూరీలో జరగనున్న నేవీ డే వేడుకలకు రాష్ట్రపతి హాజరు కానున్నారు. బ్లూ బుక్‌లోని నిబంధనల మేరకు రాష్ట్రపతికి భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. దాదాపు 40 ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించి, మొత్తం ఏర్పాట్లను 3 మంది డీసీపీలు, 15 మంది అదనపు డీసీపీలు, 5 మంది సహాయ పోలీసు కమిషనర్లు పర్యవేక్షిస్తారు. ఆమె స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత నీలాద్రి విహార్ రఘునాథ్ ముర్ము ఉద్యానవనంలో సంతాలీ రచయిత, విద్యావేత్త పండిట్ రఘునాథ్ ముర్ము విగ్రహం ఆవిష్కరించారు. స్థానిక సంతాల్‌లకు పవిత్ర స్థలం అయిన ఆదిమ్ ఓవార్ జర్నా జహెర్‌ను సందర్శించారు.

నేడు శ్రీ మందిరం సందర్శన


బుధవారం ఉదయం 9 గంటలకు రాష్ట్రపతి పూరీకి వెళ్లి జగన్నాథ ఆలయంలో దర్శనం, పూజలు చేస్తారు. పూరీలోని గోపబంధు ఆయుర్వేద కళాశాల 75వ వార్షికోత్సవం పురస్కరించుకుని వజ్రోత్సవ వేడుకలకు హాజరవుతారు. మధ్యాహ్నం పూరీలోని రాజ్ భవన్‌లో ఆమె భోజనం తర్వాత బ్లూ ఫ్లాగ్ బీచ్‌లో జరిగే నేవీ డే వేడుకల్లో పాల్గొంటారు. ఆమె గురువారం ఉదయం పూరీ నుండి భువనేశ్వర్‌కు తిరిగి వచ్చి, ఒడిశా వ్యవసాయ మరియు సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ) 40వ స్నాతకోత్సవంలో ఉదయం 11 గంటలకు హాజరవుతారు. ఆ తర్వాత, ఆమె సాయంత్రం 5 గంటలకు నగరంలో జ్యుడిషియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ప్రారంభించి, సాయంత్రం 6.30 గంటలకు తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. డిసెంబరు 6న ముర్ము తన జన్మస్థలమైన ఉపర్బెడ గ్రామ నివాసితులతో సంభాషించనున్నారు. అదే రోజు, ఆమె రాయంగ్‌పూర్‌లోని మహిళా కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో సంభాషించనున్నారు. డిసెంబరు 7న, రాష్ట్రపతి బంగిరిపోసి–గోరుమహిసాని, బురామారా–చకులియా, మరియు బాదంపహాడ్ – కెందుజార్‌ఘడ్ రైల్వే లైన్లు, గిరిజన పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రం, దండ్‌బోస్ విమానాశ్రయం, రాయరంగ్‌పూర్‌లో సబ్–డివిజనల్ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ప్రముఖ చిత్రకారుడు దాస్ ముర్ము అస్తమయం



మృతి చెందిన ప్రముఖ చిత్రకారులు దాస్ ముర్ము

జయపురం: జయపురం విక్రమ ఆర్ట్స్, క్రాఫ్ట్ కళాశాలలో శిక్షకుడు, ప్రముఖ చిత్ర కారుడు దాస్ ముర్ము(48) మయూర్‌భంజ్ జిల్లా కేంద్రాస్పత్రిలో సోమవారం కన్నుమూశారు. ఆయన జయపురం ఉన్న సమయంలో గత 9 వ తేదీన అస్వస్థతకు గురయ్యారు. అనంతరం పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. దాస్ ముర్ము మరణ వార్త విని జయపురంలోనే కాదు కొరాపుట్ జిల్లాలో చిత్రకారులు, ఆర్టిస్టులు విభ్రాంతి చెందారు. కొరాపుట్ జిల్లాలో జరుగుతున్న కొరాపుట్ పర్వ్ ఆదివాసీ మహోత్సవాలకు ప్రథమ చిత్రాన్ని చిత్రించి ఇచ్చిన కళాకారుడు దాస్ ముర్ము. అలాగే పర్వ్ పోస్టర్లకు చిత్రాలు అందించేవారు. ఏటా పర్వ్ సావనీర్ లకు ప్రథమ పేజీ అట్టలపై చిత్రాలు ముర్ము చిత్రించినవే. నవరంగపూర్ జిల్లాముండైయ్ జాత్ర, మల్కన్‌గిరి మాల్యవంత ఆదివాసీ మహోత్సవాలకు పోస్టర్లపై చిత్రాలు ఇచ్చింది కూడా ఆయనే. ఆయన మృతికి చిత్రకారులంతా సంతాపం వ్యక్తం చేశారు.



ముర్ము కొరాపుట్ పర్వ్ కోసం చిత్రించిన ఆదివాసీ కళాకారుల చిత్రం

నేడు పూరీలో పాఠశాలలకు సెలవు

భువనేశ్వర్: పూరీ మున్సిపాలిటీ పరిధిలో పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన, నేవీ దినోత్సవం పురస్కరించుకొని బాలలకు ఈ సెలవు ప్రకటించడం విశేషం. ఈ మేరకు పూరీ జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, ప్రభుత్వేతర ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత మాధ్యమిక, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ముందస్తుగా ప్రకటించిన పరీక్షలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు.

బస్సుకు తప్పిన పెను ప్రమాదం



పాతహిరమండలం సమీపంలో పక్కకు ఒరిగిన బస్సు

హిరమండలం: హిరమండలం వద్ద ఓ ప్రైవేటు బస్సుకు భారీ ప్రమాదం తప్పింది. గుణుపూర్ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న బస్సు మంగళవారం మధ్యాహ్నం పాత హిరమండలం పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ఆ సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు పక్కనే చెరువు ఉంది. ఏ మాత్రం అటు ఒరిగినా భారీ ప్రమాదం జరిగి ఉండేది. ఆ సమయంలో బస్సులో 30 మంది వరకూ ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

గొలుసు చోరీ

రణస్థలం: మండల కేంద్రం రణస్థలం నుంచి జె.ఆర్.పురం పంచాయతీ సీతంవలస ఆటోలో వెళుతున్న జైను పాపయమ్మ అనే మహిళ నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంవలస వెళ్లేందుకు థియేటర్ వద్ద పాపయమ్మ ఆటో ఎక్కింది. అప్పటికే అందులో ముగ్గురు మహిళలు ఉన్నారు. వారు పాపయ్యమ్మను మాటలతో మాయ చేసి గొలుసును తస్కరించారు. ఇంటికి వెళ్లాక గొలుసు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 14 గేదెలను జె.ఆర్.పురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కంచిలి నుంచి విశాఖపట్నం వైపు ఒక వ్యానులో 9 గేదెలు, మరో వ్యానులో 5 గేదెలు అక్రమంగా తరలిస్తున్నారు. వీటిని పైడిభీమవరం వద్ద పట్టుకుని కొత్తవలస గోశాలకు తరలించారు. ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్విజ్ పోటీలకు విశేష స్పందన



జయపురం: బొరిగుమ్మలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జయపురం సమితి స్థాయి క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. సమితి అదనపు బీడీఓ కైళాస సతపతి పర్యవేక్షణలో జరిగిన పోటీలలో సమితిలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి 164 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మహావీర్ ప్రథమ స్థానంలో నిలిచాడు. రొండాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి బాసుదేవ్ ఖాతి ద్వితీయ స్థానం, జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆదిత్య ప్రసాద్ పాణిగ్రాహి తృతీయ స్థానం పొందారు. వీరు జిల్లా స్థాయిలో జరిగే క్విజ్ పోటీలలో పాల్గొంటారని అదనపు బీడీఓ వెల్లడించారు. ముఖ్యఅతిథిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రశాంత పట్నాయక్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. సాగరిక పాత్రో, విశ్వరంజన్ గౌడ, హితకరా చరడి, సౌమ్యరంజన్ పట్నాయక్, పాపిత ప్రదాన్, దీపక్ సాహు తదితరులు పాల్గొన్నారు.

శక్తి సంరక్షణపై క్విజ్ పోటీలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శక్తి సంరక్షణపై సమితి స్థాయిలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఒడిశా ప్రభుత్వ అటవీ పర్యావరణం, వాతావరణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో సమితిలోని 23 ఉన్నత పాఠశాలల నుంచి 214 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బొరిగుమ్మ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బిజయానంద పట్నాయక్ పర్యవేక్షణలో జరిగిన పోటీలలో తొరాభట ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థి అభిలాష్ శతపతి ప్రథమ, బిజాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి సిప్ల మహంతి ద్వితీయ, బొరిగుమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థి సత్య ప్రకాశ్ దత్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ముగ్గురుని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు హెచ్‌ఎం వెల్లడించారు. ఈ పోటీలను బొరిగుమ్మ అదనపు బీడీఓ సుభాష్ చంద్ర మఝి, ఉపాధ్యాయులు గౌరీ శంకర సామంతరాయ్, ఘనశ్యామ్ సాహు, నృసింహ చరణ నాయక్, రజనీ పారిడ, రాజేశ్వరి నాయక్ తదితరులు పర్యవేక్షించారు.



జయపురం:క్విజ్ విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రశాంత పట్నాయక్

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దు

కాశీబుగ్గ:

పచ్చటి ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దని ప్రజా సంఘ నాయకులు అన్నారు. మందస మండలం రాంపురంలో మంగళవారం బాధిత రైతులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చాపర వేణుగోపాలరావు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ప్రజలకు ఎలాంటి పనులు చేస్తే హర్షిస్తారో వాటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రజలకు అవసరం లేని కార్గో విమానాశ్రయం కట్టడం వల్ల ఉద్దాన వాసులకు ఏం ఉపయోగమో చెప్పాలన్నారు. భూములకు పరిహారం ఇచ్చినంత మాత్రాన వారి జీవితాలు గడిచిపోవని, విలువైన భూములు ఉంటే నిత్యం ఉపాధి ఉంటుందని స్పష్టం చేశారు. సుమారు 1400 ఎకరాల భూమిని ఎంపిక చేస్తున్నప్పుడు స్థానికుల అభిప్రాయం పట్టించుకోకపోవడం తగదన్నారు. తక్షణమే నిర్ణయాన్ని వెనుక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళలతో కలిసి ఉద్దాన ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘ నాయకులు సీహెచ్ రవికుమార్, బత్తిని లక్ష్మణరావు, నారాయణస్వామి, పి.ఆరేలమ్మ, కొన్న శ్రీనివాసరావు, తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ వాసు, నాయకులు గున్నయ్య, పరుశురాం, సంతోష్, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో ఉద్దాన మహిళలు

ధాన్యం తరలింపులో కక్ష సాధింపు తగదు

కంచిలి: రైతులు పండించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు వీలు లేకుండా టీడీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కంచిలి ఎంపీపీ, శ్రీ కంచమ్మతల్లి మోడరన్ రైస్‌మిల్లు యజమాని పైల దేవదాస్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం దళారులతో ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి విముక్తి కలిగిస్తూ, సుమారు పదేళ్లుగా సిర్తలి గ్రామంలో రైస్‌మిల్లును నెలకొల్పి నిజాయితీగా వ్యాపారం చేస్తూ, సేవాదృక్పథంతో లావాదేవీలు చేస్తున్నదానికి రాజకీయ రంగు పులిమి, ప్రభుత్వం నుంచి మంజూరు చేసే సార్టెక్స్ అనుమతులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ మేరకు తహశీల్దార్ ఎస్. రమేష్‌కుమార్‌ను పరిసర ప్రాంత రైతులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కక్షసాధింపు చర్యలు వీడి సార్టెక్స్ అనుమతులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు యారడి ఆనందరావు, అయిధం జయరాం, పలికల జయరాం, డొక్కరి బలరాం, కప్పల యుగంధర్, మెండ ప్రకాశ్, బుడ్డెపు విశ్వనాథం, రైతులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ, రైతులు

తమిళనాడు దంపతులకు శిశువు దత్తత



కలెక్టర్ చాంబర్‌లో 13 ఏళ్ల బాలికను అప్పగిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక శిశు సురక్ష పునరావాస కేంద్రం నుంచి ఓ 13 ఏళ్ల బాలికను తమిళనాడుకు చెందిన దంపతులు దత్తత తీసుకున్నారు. పిల్లలు లేని తమిళనాడు దంపతులు గత ఏడాది కేంద్ర పోష్య సంతాన రిసోర్సు కేంద్రం పోర్టల్‌లో నమోదు చేసుకున్నాక జిల్లా యంత్రాంగం పరిశీలించింది. తర్వాత కలెక్టర్ బిజయ కుమార్ దాస్ చాంబర్‌లో శిశువును తమిళనాడు దంపతులకు దత్తతగా అప్పగించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, ఉత్కళ బాలాశ్రమం, జిల్లా శిశు సురక్షా సమితి అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. ఇప్పటివరకూ గజపతి జిల్లా కేంద్రం నుంచి 62 శిశువులను దత్తతగా అందజేసినట్టు అధికారులు తెలిపారు.

పర్లాకిమిడి ప్రభుత్వాస్పత్రిలో ఐసీయూ స్పెషలిస్టుల కొరత



ఒడిశా అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



పర్లాకిమిడి: స్థానిక ప్రభుత్వ కేంద్ర ప్రభుత్వాస్పత్రిలో స్పెషలిస్టు డాక్టర్ల కొరత ఉందని, కొత్త వైద్యులను నియమించాలని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఒడిషా శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నను లేవదీశారు. పర్లాకిమిడి పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూ చాలా రోజులుగా పనిచేయడం లేదని తాగునీటి సమస్య తలెత్తుతోందని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. గజపతి జిల్లాలో అనేక రోజులుగా బంగాళా దుంపల ధరలు తగ్గడం లేదని, దీనిపై అధికారులు, మంత్రులు పట్టించుకోవడం లేదని అసెంబ్లీలో విమర్శించారు.

రోడ్డు పనులు వేగవంతం చేయండి



ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అనుమతులు ఉన్న చోట రోడ్డు పనులు వేగవంతం చేయాలని, ముగింపు దశలో ఉన్న భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, పంచాయతీరాజ్ ఈఈ ఎస్.రామకృష్ణ, జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న రోడ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనులను వివరించారు. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్డు ప్రాజెక్ట్‌లో 315 రోడ్డు పనులు ఉన్నాయని, అందులో 35 పూర్తయ్యాయని, 280 పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, సోంపేట పనులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలపై ఆరాతీశారు. అనంతరం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏషాన్ బాషా, పలువురు ఇంజినీర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యాచరణ



స్టాపర్లను ప్రారంభిస్తున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కార్యాచరణతో సంబంధిత విభాగాల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం సీఎంఆర్, ఎస్ఆర్, సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ యాజమాన్యాల సౌజన్యంతో అందజేసిన స్టాపర్స్, రేడియం జాకెట్లు, మాస్కులు, ఎల్ఈడీ బ్యాటున్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని చోట్ల ఇరుకు రోడ్ల వల్ల ట్రాఫిక్ సమస్య వస్తోందని, అలాంటి చోట్ల ఈ పరికరాలు ట్రాఫిక్ నియంత్రణలో సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐలు ఇమాన్యువల్ రాజు, పైడపునాయుడు, యాజమాన్యాల ప్రతినిధులు జీవీ రమణ, వెంకటేశ్వరరెడ్డి, రమేష్, రాజేష్, సురేష్, వేణుగోపాల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విదేశాంగ మంత్రి దృష్టికి 'సౌదీ' కార్మికుల సమస్య



జైశంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉపాధి నిమిత్తం విదేశాలకు వలస వెళ్లి మోసపూరిత యాజమాన్యాల చేతిలో చిక్కుకున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన కార్మికులను తిరిగి స్వదేశానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను ఢిల్లీలో మంగళవారం కలిసి సమస్య వివరించారు. 22 మంది కార్మికులు రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆహారం సైతం లేక అల్లాడుతున్నారని చెప్పారు. బాధితులకు సత్వర సాయం అందించేలా సౌదీలోని భారత ఎంబసీకి సమాచారం అందించాలని విన్నవించారు. దీనిపై జైశంకర్ సానుకూలంగా స్పందించారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దివ్యాంగుడు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ వెల్లడించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఓ దివ్యాంగుడు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కలెక్టర్‌కు కేంద్ర మంత్రి సూచించినట్లు చెప్పారు. స్వయం ఉపాధి రుణాల మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. 2023–25 బ్యాక్‌లాగ్ పోస్టులపై భర్తీపై కలెక్టర్‌తో మాట్లాడతానని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు లక్ష్యం సాధించేందుకు అంగవైకల్యం అడ్డురాదన్నారు. అనంతరం బెహర మనో వికాస కేంద్రం విభిన్న ప్రతిభావంతులు కోలాటంతో ఆకట్టుకున్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కళ్లేపల్లి ఉషారాణి విభిన్న ప్రతిభావంతులకు వివిధ ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు, విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకులు కవిత, దివ్యాంగుల సంఘం కార్యదర్శి డాక్టర్ ఎంకే మిశ్రో, విభిన్న ప్రతిభావంతుల అసోషియేషన్ ప్రతినిధి రత్నాల శ్రీనివాసరావు, ఉంగటి సురేష్, దివ్యాంగులు అప్పలనాయుడు, సింహాచలం, రమా, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీఐపీఆర్ఓ కె.చెన్నకేశవరావు, జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విధానంతో అధిక దిగుబడులు

ఆమదాలవలస:

చేపల పెంపకంలో శాస్త్రీయ విధానాలు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. ఆమదాలవలసలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం చేపలు రొయ్యల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణపై మత్స్య శాఖ విస్తరణ అధికారులకు శిక్షణ నిర్వహించారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి(హైదరాబాద్) సహకారంతో ఈ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యాధి నిర్ధారణ యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉన్నప్పుడే రైతులకు నాణ్యమైన సేవలు అందించవచ్చన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ సహాయ సంచాలకులు వై.సత్యనారాయణ, కేవీకే శాస్త్రవేత్తలు జి.ఎస్.రాయ్, సునీత, హరికుమార్, కిరణ్‌కుమార్, అనూషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు


పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న పైడితల్లి

విజయనగరం టౌన్‌: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్‌, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమ సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్‌ ఈఓ కేఎన్‌వీడీ. ప్రసాద్‌ పర్యవేక్షించారు.

చిట్‌ఫండ్‌ ప్రతినిధులతో జిల్లా జడ్జి సమావేశం


చిట్‌ఫండ్‌ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్‌ చక్రవర్తి

విజయనగరం: ఈనెల 14న జరగబోయే జాతీయ లోక్‌ అదాలత్‌లో రాజీ చేసుకుని ఎక్కువ కేసులను పరిష్కరించుకోవాలని చిట్‌ఫండ్‌ కంపెనీలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్‌ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్‌లు సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లాలో ఉన్న చిట్‌ఫండ్‌ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14న జరగబోయే జాతీయ లోక్‌అదాలత్‌లో తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్గదర్శి, కపిల్‌ ,శ్రీరామ్‌చిట్‌ ఫండ్స్‌ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్‌ సదస్సుకు బాలభవన్‌ విద్యార్థులు


జాతీయ బాలల సైన్స్‌ సదస్సుకు ఎంపికైన రాజాం బాలభవన్‌ విద్యార్థులు

రాజాం: జాతీయ బాలల సైన్స్‌ సదస్సుకు రాజాం పట్టణంలోని బాలభవన్‌కు చెందిన ఎం.దినేష్‌, సీహెచ్‌.జాస్పర్‌, ఎస్‌.సాయినిరంజన్‌లు ఎంపికైనట్లు బాలభవన్‌ డైరెక్టర్‌ ఎస్‌.రమేష్‌ మంగళవారం తెలిపారు. ఇటీవల గవర్నమెంట్‌ ఆఫ్‌ ఇండియా రాష్ట్రస్థాయి బాలభవన్‌ పోటీలు నిర్వహించిందని. అందులో రాష్ట్రం తరపున ఒక టీమ్‌ను ఎంపికచేయగా, ఆ టీమ్‌లో రాజాం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం విశేషమని వెల్లడించారు. త్వరలో ఔరంగాబాద్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొనే టీమ్‌లో బాలభవన్‌ చిన్నారులు పాల్గొంటారని వివరించారు. వారి ఎంపికపట్ల పలువురు రాజాం పట్టణవాసులు అభినందనలు తెలిపారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

విజయనగరం: నిబంధనలకు విరుద్ధంగా దాసన్నపేట ప్రాంతంలో నిర్మించిన భవన నిర్మాణంలో కొంత భాగాన్ని విజయనగరం కార్పొరేషన్‌ ప్రణాళిక విభాగం సిబ్బంది మంగళవారం తొలగించారు. అక్రమ నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్‌ ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భాగాన్ని సిబ్బందితో కూల్చివేశారు. అదేవిధంగా మరో భవనంలో కూడా అనుమతుల్లేకుండా పై అంతస్తు వేయడంతో వాటికి అమర్చిన సెంట్రింగ్‌ పనులను సిబ్బంది అడ్డుకున్నారు.

ఇళ్ల స్థలాల కేటాయింపు

విజయనగరం అర్బన్‌: ఎన్టీఆర్‌ టౌన్‌షిప్‌ (ఎంఐజీ లే ఔట్స్‌)లో ఇళ్ల స్థలాలను లాటరీ పద్ధతిలో వీఎంఆర్‌డీఏ కేటాయించింది. కలెక్టరేట్‌ ఆడిటోరియంలో మంగళవారం వీఎంఆర్‌డీఏ అధికారులు లాటరీ ప్రక్రియను నిర్వహించారు. రఘుమండ లే ఔట్‌లో మిగిలిపోయిన ఎంఐజీ-1 ఏడు ప్లాట్లను, జియ్యన్నవలస లే అవుట్‌లో ఎంఐజీ-1 ప్లాట్లు 25, ఎంఐజీ-2 ప్లాట్లు 4, ఎంఐజీ-3 ప్లాట్లు11కు లాటరీ పూర్తి చేశారు. ప్లాట్లు పొందిన వారికి జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌.శ్రీనివాసమూర్తి ప్లాట్ల కేటాయింపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉడా లే ఔట్లలో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని స్పష్టం చేశారు. ఉడా స్థలాలను కొనుగోలు చేయడం భరోసానిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీ ప్లానింగ్‌ అధికారి కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్‌ ప్లానింగ్‌ అధికారులు నాయుడు, చామంతి, మౌనిక, జేపీఓ జానకి, ఏఓ రాజశేఖర్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పశుగ్రాసం సాగు

- శతశాతం సబ్సిడీతో 10 నుంచి 50 సెంట్లలో సాగుకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులు


పాలకొండ మండలంలో సాగవుతున్న పశుగ్రాసం


ఈ తరహా మేలైన పశుగ్రాసం ఆరోగ్యదాయకం

పాలకొండ రూరల్‌: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు శత శాతం సబ్సిడీతో బహువార్షిక పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని పార్వతీపురం మన్యం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్‌ డైరెక్టర్‌ శివ్వాల మన్మథరావు తెలిపారు. ఈ మేరకు రైతులు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగుచేసుకోవచ్చని చెప్పారు. ఈ నేపథ్యంలో పశుగ్రాసాల సాగుకు సంబంధించి యంత్రాంగం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నిబంధనల మేరకు జాబ్‌ కార్డు ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతోపాటు సన్న, చిన్నకారు రైతులు బహువార్షిక పశుగ్రాసాల సాగుకు అర్హులు. ఈ క్రమంలో జీవాల పోషణ, పాడిరంగం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 6,000 ఎకరాల వరకు పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో 820 ఎకరాల్లో పశుగ్రాసం సాగులో ఉంది.

శతశాతం రాయితీ..

10 సెంట్లలో పశుగ్రాసం సాగు చేసేందుకు మొత్తం ఖర్చు రూ.6,599 అవుతుంది. ఇందులో లేబర్‌ కాంపొనెంట్‌ కింద రూ.3 వేలు, మెటీరియల్‌ కాంపొనెంట్‌ (విత్తనం ధర, ఇతర ఖర్చులు) కింద రూ.3,599 చెల్లిస్తారు. 20 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్‌ ఖర్చు రూ.6 వేలు, మెటీరియల్‌ ఖర్చు రూ.7,197 (మొత్తం రూ.13,197), 30 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్‌ ఖర్చు రూ.9 వేలు, మెటీరియల్‌ ఖర్చు 10,795 (మొత్తం రూ.19,795), 40 సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్‌ ఖర్చు రూ.12 వేలు, మెటీరియల్‌ ఖర్చు రూ.14,394 (మొత్తం రూ.26,394), 50సెంట్లలో సాగు చేసుకుంటే లేబర్‌ ఖర్చు రూ.15 వేలు, మెటీరియల్‌ ఖర్చు రూ.17,992 (మొత్తం రూ.32,992) ఉపాధి నిధుల నుంచి చెల్లిస్తారని పశు సంవర్ధక శాఖ జేడీ వివరించారు.

ఆసక్తిగల రైతులు సంప్రదించాలి

ఆసక్తిగల రైతులు తమ దరఖాస్తుతో పాటు ఉపాధి జాబ్‌కార్డు, భూమికి సంబంధించిన 1బి, ఆధార్‌ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు నకలు సమర్పించాల్సి ఉంటుంది. రైతులు తమ గ్రామాకు సమీపంలోగల పశు వైద్యులను సంప్రదించాల్సి ఉంది.

సూపర్‌ నేపియర్‌ రకం అనుకూలం



బహువార్షిక పశుగ్రాసాల సాగుకు సూపర్‌ నేపియర్‌ రకం ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులకు అనుకూలం. బహువార్షిక రకాల్లో ఇది ముఖ్యమైనది. పశుగ్రాసం అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. సారవంతమైన నేలల్లో అధిక దిగుబడి వస్తుంది. సూపర్‌ నేపియర్‌ రకాన్ని అన్ని కాలాల్లోనూ సాగు చేయవచ్చు. 50 సెంట్ల భూమిలో ఏడాదికి 100 టన్నుల వరకు పశుగ్రాసం దిగుబడి వస్తుంది. ఈ తరహా పశుగ్రాసాలు ఒక్కసారి సాగుచేసుకుంటే కొన్నేళ్ల పాటు దిగుబడి వస్తుంది. రైతులు నీటి సదుపాయం కల్పించాల్సి ఉంటుంది.

– డాక్టర్‌ శివ్వాల మన్మథ రావు, పశుసంవర్ధక శాఖ జేడీ, పార్వతీపురం మన్యం

వికసించిన గ్రామీణ క్రీడా కుసుమం

- భారత జూనియర్‌ వాలీబాల్‌ జట్టుకు విజయలక్ష్మి ఎంపిక
- థాయిలాండ్‌లో శిక్షణ శిబిరానికి అర్హత


భారత జూనియర్‌ వాలీబాల్‌ జట్టుకు అర్హత సాధించిన విజయలక్ష్మి


విజయలక్ష్మిని అభినందిస్తున్న వాలీబాల్‌ సంఘం ప్రతినిధులు

విజయనగరం: భారత జూనియర్‌ వాలీబాల్‌ జట్టుకు విజయనగరం జిల్లాకు చెందిన గ్రామీణ క్రీడాకారిణి అర్హత సాధించింది. జిల్లాలోని గుర్ల మండలం జమ్ము గ్రామానికి చెందిన ఎం.విజయలక్ష్మి ఈ ఘనత సాధించి గ్రామీణ క్రీడాకారుల సత్తా చాటింది. విశాఖలో స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్‌ హాస్టల్‌లో శిక్షణ పొందిన ఆమె ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన భారత జూనియర్‌ వాలీబాల్‌ జట్టు ఎంపిక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైన 16 మందిలో స్థానం దక్కించుకుంది. భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారిణి విజయలక్ష్మి జనవరి నెలలో థాయిలాండ్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి హాజరుకానుంది. ఇప్పటికే పలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు దక్కించుకున్న విజయలక్ష్మి భారత జట్టుకు అర్హత సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గ్రామీణస్థాయి నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్న విజయలక్ష్మిని రాష్ట్రవాలీబాల్‌ సంఘం అధ్యక్షుడు పీజీవీఆర్‌ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్‌దాస్‌, జిల్లా అధ్యక్షుడు సూరిబాబు, కార్యదర్శి కేవీఎస్‌ రాజు, స్కూల్‌ గేమ్స్‌ అసోసియేషన్‌ కార్యదర్శి కృష్ణంరాజు, కోచ్‌ సత్యనారాయణలు అభినందించారు. విజయలక్ష్మి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

ఆమె ప్రతిభ 'ప్రత్యేకం'

- స్వప్నకు కల్చరల్‌ అవార్డు అందజేసిన తెలంగాణ గవర్నర్‌
- ఆనందం వ్యక్తం చేస్తున్న అవార్డు గ్రహీత


తెలంగాణ గవర్నర్‌ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న స్వప్న

రేగిడి: మండలంలోని నాయిరాలవలస గ్రామానికి చెందిన కొవ్వాడ స్వప్నకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ మంగళవారం హైదరాబాద్‌లో కల్చరల్‌ అవార్డును అందజేశారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డును స్వప్నకు అందించినట్లు ఆమె బంధువులు తెలిపారు. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒక దఫా ఈ అవార్డు అందిస్తారని, ఈ ఏడాది తనకు కూడా అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని స్వప్న వెల్లడించింది. తనకు రెండు చేతులు లేకపోయినా నోటి ద్వారా చిత్ర కళా రంగంలో రాణించినట్లు వివరించింది.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత

- 5వ బెటాలియన్‌ కమాండెంట్‌ మల్లికా గార్గ్‌


5వ బెటాలియన్‌ కమాండెంట్‌ మల్లికాగార్గ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: ఆర్థిక స్వావలంబనతోనే మహిళా సాధికారత సాధ్యపడుతుందని, ఆ దిశగా రాణించేందుకు టైలరింగ్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని చింతలవలస 5వ బెటాలియన్‌ కమాండెంట్‌ మల్లికా గార్గ్‌ అన్నారు. ఈ మేరకు స్థానిక థెరిసా క్లబ్‌లో టైలరింగ్‌ లో మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కమాండెంట్‌ గార్గ్‌ మాట్లాడుతూ గత 30 ఏళ్లగా థెరిసా క్లబ్‌ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, విద్యార్థులకు కంప్యూటర్‌ శిక్షణ, పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నిత్యాన్నదానం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. సేవామూర్తి మదర్‌ థెరిసా స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం క్లబ్‌ ప్రతినిధులు ముఖ్య అతిథి కమాండెంట్‌ మల్లికాగార్గ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్‌ వ్యవస్థాపకురాలు కురియాకోస్‌, సభ్యులు గ్రంధి విష్ణుమూర్తి, రెడ్డి ఆదినారాయణ, డి.సుకుమార్‌, పి.జనార్దన రావు, పప్పు విశ్వనాథం, డి.నవ్య, పి.తేజస్విని, బి.మంజుల తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ప్రక్రియగా వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న జిల్లా పోలీస్‌ అధికారులు

విజయనగరం క్రైమ్‌: జిల్లాలో గంజాయి, మద్యం, సారా, పశువుల అక్రమ రవాణాను నియంత్రించడంలో భాగంగా ఆకస్మిక వాహన తనిఖీలను నిరంతర ప్రక్రియగా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చేపడుతున్నామని ఎస్పీ వకుల్‌ జిందాల్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ జిల్లావ్యాప్తంగా పది ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వాహన తనిఖీల్లో మోటారు వాహన చట్టం నిబంధనలు అతిక్రమించిన వారికి ఈ చలానాలను విధిస్తున్నామని పేర్కొన్నారు. వాహన తనిఖీల్లో సక్రమమైన నంబర్‌ ప్లేట్స్‌ లేనివారిపై 280 కేసులు, యూనిఫాం లేకుండా వాహనాలు నడిపిన వారిపై 520 కేసులు, హెల్మెట్స్‌ ధరించని వారిపై 7020 కేసులు, సిగ్నల్స్‌ అతిక్రమించిన వారిపై 570 కేసులు, వాహన రికార్డులు లేని వారిపై 70 కేసులు, ప్రమాదకరంగా వాహనాలను నడిపిన వారిపై 209 కేసులు, అతివేగంగా వాహనాలు నడిపిన వారిపై 24 కేసులు, సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ వాహనాలు నడిపిన వారిపై 220 కేసులు, ప్రమాదకరంగా వాహనాలను పార్కింగ్‌ చేసిన వారిపై 172 కేసులను గత 10 నెలల్లో నమోదుచేశామని ఎస్పీ తెలిపారు.

రైతు కూలీసంఘం రాష్ట్ర మహాసభల సావనీర్‌ ఆవిష్కరణ


పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్‌:

విజయనగరం పట్టణంలో గల ఏపీటీఎఫ్‌ కార్యాలయం వద్ద ఇటీవల ఏలూరులో నిర్వహించిన రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల సావనీర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సభకు ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెహరా శంకరరావు అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా హాజరైన కందాపు ఫాల్గుణరావు (అడ్వకేట్‌) సావనీర్‌ను ఆవిష్కరించారు. పెట్టుబడిదారుల నుంచి రైతాంగాన్ని ఎలా కాపాడుకోవాలి? అలాగే రైతు కూలీలను ఎలా రక్షించాలి? అనే విషయాలతో పాటు సావనీర్‌లో దేశ పరిస్థితుల గురించి వివరంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరివర్మ మాట్లాడుతూ రైతాంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోతోంది. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక దాదాపు 3 లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లు, బహుళజాతి కంపెనీలకు అప్పగించడానికి పాలకులు పూనుకుంటున్నారు. కంపెనీ వ్యవసాయక, కార్పొరేట్‌ వ్యవసాయక రంగంగా మార్చడానికే సిద్ధమవుతున్నారని విమర్శించారు.

పాలకుల విధానాలపై పోరాడాలి

గత నాలుగు సంవత్సరాలుగా రైతాంగానికి ఎంఎస్పీ ఉండాలని పంజాబ్‌ హర్యానా లాంటి రాష్ట్రాల్లో పోరాటాలు జరిగాయి. వ్యవసాయ రంగంలో ఉపయోగపడే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను మూసి వేస్తున్నారు. దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న మతోన్మాదం గురించి వివరంగా మాట్లాడుతూ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేశారు. కార్మిక రంగంలో ఉన్న 44 చట్టాలను నాలుగు లేబర్‌ కోడ్లుగా మార్చి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం దారుణం

నవయువ సమాఖ్య అప్పలరాజు మాట్లాడుతూ ఎంతోమంది ఉపాధి పొందుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం, మూసివేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకీ నిరుద్యోగ సమస్య పెరిగిపోతోంది. పోస్టులు భర్తీ చేయడం లేదు. ఏ ఆశయం కోసం అయితే రైతు కూలీ సంఘం పనిచేస్తుందో దానికి నవయువ సమాఖ్య మద్దతు తెలుపుతూ పోరాటంలో భాగస్వాములమవుతామ ని చెప్పారు.

సాఫ్ట్‌బాల్‌ పోటీలలో ఆరికతోట విద్యార్థినుల సత్తా


రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం శర్మ, పీడీ అప్పలనాయుడు

రామభద్రపురం: ఈ నెల 28,29,30 తేదీల్లో కాకినాడ జిల్లాలో జరిగిన స్కూల్‌గేమ్స్‌ అండర్‌ 17 బాలికల విభాగం రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలలో రామభద్రపురం మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సత్తాచాటారు. అండర్‌ 17 బాలికల విభాగంలో 10వ తరగతి చదువుతున్న అడపా భవనేశ్వరి, వర్రి ధనలక్ష్మి, పిరిడి జయశ్రీ, 9వ తరగతి చదువుతున్న రేజేటి శ్రావణిలు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌ పోటీలలో ప్రథమస్థానం సాధించారని వ్యాయామ ఉపాధ్యాయుడు వి.అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల హెచ్‌ఎం జీసీహెచ్‌ఎస్‌ శర్మ, తదితర ఉపాధ్యాయులు అభినందించారు.

పెనుబాకలో డయేరియా


రాజాం ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెనుబాక డయేరియా బాధితులు

రాజాం/రాజాంసిటీ: రాజాం మండలంలోని పెనుబాక గ్రామంలో డయేరియా విజృంభించింది. గ్రామానికి చెందిన కలమటి నాగమణి, బొమ్మాళి లక్ష్మి, కొండేటి మహేశ్వరరావుతో పాటు కలమటి మహేష్‌ అనే బాలుడు అస్వస్థతకు గురై ప్రాంతీయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో తాగునీరు కలుషితం కావడం, పారిశుద్ధ్య లోపమే కారణమని బాధితులు వాపోయారు. డయేరియా సమాచారంతో బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి సిద్ధీశ్వరి తన సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటి సర్వే చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులతో కలిసి డయేరియా వ్యాప్తిపై ఆరా తీశారు. గ్రామస్తులు ఆందోళన చెందవద్దని, అవసరమైన వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యుఎస్‌ జేఈ జగన్మోహనరావు గ్రామంలో తాగునీటి శాంపిల్స్‌ సేకరించి పరీక్షకు పంపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘంటసాల గానామృతానికి సర్వం సిద్ధం


నిర్విరామ ఘంటసాల స్వరాభిషేక ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న కళాపీఠం వ్యవస్థాపకులు భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్‌: ఘంటసాల జయంతిని పురస్కరించుకుని 12 గంటల నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు తెలిపారు. ఈ మేరకు కళాపీఠం ఆవరణలో మంగళవారం ఆయన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఘంటసాల 102వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆనందగజపతి ఆడిటోరియం ఆవరణలో ఈ నెల 4న బుధవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్విరామ ఘంటసాల స్వరాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రారంభ సభా కార్యక్రమానికి నగర డిప్యూటీ మేయర్‌ కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని, సాయంత్రం సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌, విశిష్ట అతిథిగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి హాజరవుతారన్నారు. ప్రముఖ గాయకులు సౌజన్య, జయంతి హారిక శివరాం తెలుగు ఇండియన్‌ ఐడల్‌ టీమ్‌ పాల్గొని అలనాటి ఘంటసాల పాటలతో అందరినీ అలరిస్తారన్నారు. ఎం.సాయికుమార్‌, పవన్‌కుమార్‌ల సంగీత వాయిద్య సహకారంతో గాయకులు తమ గానామృతాన్ని ఆలపిస్తారని, సంగీతాభిమానులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ధవళ సర్వేశ్వరరావు, గ్రంధి విష్ణు, వైవీ.సత్యనారాయణ (అబ్బులు) తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

- విలపిస్తున్న కుటుంబసభ్యులు


చంద్రశేఖర్‌ (ఫైల్‌)


రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

బాడంగి/బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని రాజ్‌మహల్‌కు వెళ్లే ఓవర్‌ బ్రిడ్జి కిందగల రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కింద పడి బాడంగి మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన కొండేటి చంద్రశేఖర్‌ (21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుడి కుటుంబసభ్యులు, రైల్వే ఎస్సై బాలాజీ తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం భీమవరానికి చెందిన తాతయ్య అప్పన్న, నాయనమ్మ చిన్నమ్మి వద్ద రెండేళ్లుగా చంద్రశేఖర్‌ ఉంటూ ఉద్యోగం వేటలో భాగంగా బొబ్బిలిలోని ప్రైవేట్‌ కోచింగ్‌ సెంటర్‌లో చదువుకుంటూ భీమవరం నుంచి రోజూ రాకపోకలు సాగిస్తున్నాడు. చంద్రశేఖర్‌ తండ్రి నారాయణరావు మూడేళ్ల క్రితమే చనిపోగా తల్లి పైడితల్లి పొట్టకూటి కోసం పెద్దకుమారుడు సత్యనారాయణతో కలిసి గుంటూరులోని పత్తిమిల్లులో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. చంద్రశేఖర్‌ కూడా గుంటూరులోనే డిగ్రీ వరకు చదువుకుని ఏదైనా ఉద్యోగం సాధించాలన్న తపనతో రెండేళ్ల క్రితం తాత, నాయనమ్మల దగ్గరికి వచ్చి బొబ్బిలిలో కోచింగ్‌ తీసుకుంటున్నాడు. తన తల్లి పంపించిన డబ్బులు ఏటీఎంలో తీసుకోవాలని ఇంటి దగ్గర చెప్పి సోమవారం ఉదయం 11గంటలకు బొబ్బిలి వెళ్లిన చంద్రశేఖర్‌ రాత్రి అయినా రాకపోవడంతో తాత, నాయనమ్మలు ఫోన్‌చేశారు. స్నేహితుల దగ్గర ఉండి మంగళవారం వస్తానని తమ మనుమడు చెప్పాడని ఇంతలోనే ఇలా జరిగిందంటూ రోదిస్తున్నారు. అయితే దీనిపై రైల్వే ఎస్సై బాలాజీ వివరణ మేరకు రెండు రోజులుగా బొబ్బిలి రైల్వేస్టేషన్‌, ఆర్టీసీ కాంప్లెక్స్‌ ప్రాంతాల్లో చంద్రశేఖర్‌ పోలీసులకు కనిపిస్తూ తిరిగి వెళ్లిపోయేవాడు. చివరిగా మంగళవారం వేకువజామున ఫ్లైఓవర్‌ కింద గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్‌లోని సమాచారం మేరకు ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు అలవాటుపడినట్లు తెలుస్తోందని ఎస్సై బాలరాజు అభిప్రాయ పడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి ఆస్పత్రికి రైల్వేపోలీసులు తరలించారు.

90 గొర్రెల మృత్యువాత

- ఆహారం జీర్ణం కాకపోవడంతో ప్రమాదం
- చెరువు నీటి శాంపిల్స్‌ సేకరించిన అధికారులు
- ముగ్గురు రైతులకు రూ.9లక్షల ఆస్తినష్టం


పెద బూరాడపేటలో మృతిచెందిన గొర్రెలు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల రూరల్‌: మండలంలోని పెద్ద బూరాడపేట గ్రామంలో సుమారు 90 గొర్రెలు మంగళవారం ఏకకాలంలోనే మృతి చెందడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటనపై బాధిత రైతులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతులు డొప్ప త్రినాథ్‌, దూలి సత్యం, కర్రి సూర్యనారాయణలు సుమారు 400 గొర్రెలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల పంట పొలాల్లో నేలరాలిన వరి ధాన్యాన్ని కడుపు నింపుగా మేసిన గొర్రెలు జీర్ణించుకోలేకపోయాయి. దీంతో ఒకదాని తరువాత మరొకటిగా మృతి చెందాయి. మంగళవారం ఉదయానికి 90 గొర్రెలు మృతిచెందాయని, సుమారు రూ.9 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందంటూ బాధిత రైతులు వాపోతున్నారు. ధాన్యం మేసిన తరువాత పక్కనే ఉన్న చెరువులో గొర్రెలు దాహార్తి తీర్చుకున్నాయని చెబుతున్నారు. ఒకేసారి భారీ సంఖ్యలో గొర్రెలు మృతి చెందడంతో బాధితులు భోరున రోదించారు. మృతిచెందే గొర్రెల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందంటూ వాపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పశువైద్యాధికారి చంద్రశేఖర్‌ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లి అనారోగ్యానికి గురైన గొర్రెలకు చికిత్స అందించారు. అనంతరం మృతి చెందిన గొర్రెల కళేబరాలకు పోస్టుమార్టం నిర్వహించడంతో పాటు చెరువులో నీటి శాంపిల్స్‌ను సేకరించారు.

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే నాగమాధవి

గొర్రెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం నాగ మాధవి గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. పశు వైద్యాధికారులు, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న గొర్రెలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితులకు ప్రభుత్వం తరఫున న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. జేడీ రమణ, ఏడీఏ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు మక్కువ వెంకటరమణ, బెల్లాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.